గాడు. సినిమాల గురించీ, స్టూడియోల గురించీ చెపితే ఆ అడిగి నాయన కళ్ళింతవి చేసుకుని చూశాడు. 'హెడ్మాష్టరు చిన్నోడు కాడు, మాగట్టి బుర్రే' అనుకున్నారు. ఢిల్లీలో, కలకత్తాలో, బొంబాయిలో, మద్రాసులో. హైదరాబాద్ లో, ఖర్గపూర్ లో ఆయనకి బంధువులూ స్నేహితులూ ఉన్నారని, ఆవూరి బ్రాంచి పోస్టుమాష్టర్ పట్నాయక్ కి తెలుసు. అతడి ద్వారా మరికొందరికి తెలుసు.

అలాంటి బసవరాజుని ఆరోజు ఆరాత్రి ఓ పల్లెటూరి రైతు ఇంటి ముందు అందరు అనాగరికులు భయంకరంగా చుట్టుముట్టారు, బసవరాజు భోజనానికి గదినించి బయల్దేరేముందు ఆయింటామె మామ్మ, 'ఇలా అనుకుంటున్నారు. ఉదయం ఈశ్వరాలయం నూతి దగ్గర ఇలా జరిగిందంట, నిజమేనా? మనుషులు మంచి వాళ్ళు కారు.' అని చెప్పింది.

బసవరాజుకి అప్పుడు తెలిసింది తప్పుచేసినట్టు. చాలా పెద్ద తప్పునే తను వొళ్ళు మరచి చేసినట్టు, అంతవరకూ అతడు మంచి పని చేస్తున్నాను అనుకున్నాడు.' ఆ అమ్మాయి రోజూ తను స్నానం చేసే వేళకే ఈశ్వరాలయం మెట్టమీదికి పిడకలు చేసుకోటానికి వస్తుంది. ఇట్లా చూపులతో చాలా రోజులు గడిచాయి. చివరికి ఈరోజు ఆ అమ్మాయిని పిలవాలనిపించింది. కోరిక ఆపుకోలేక పిలిచాడు. మాట్లాడాలనుకున్నాడు. ఇల్లాంటి అమ్మాయిని చేసుకోవడం సంస్కారమౌతుందని భావించాడు. ఇట్లాంటి అమ్మాయికి ఈజిప్టులో పిరమిడ్ల గురించీ, గ్రీకు శిల్పాల గురించీ, ఫ్రెంచి విలాస జీవితం గురించీ, టాగోర్ కథల గురించీ, అమెరికా ఆకాశపు భవనాలుగురించీ, జాజ్ సంగీతంగురించీ, చైనా గోడ గురించీ మొత్తం ప్రపంచం గురించీ చెప్పి గొప్పదాన్ని చెయ్యడం నిజమైన సంస్కారం అనుకున్నాడు.

ఆ పల్లెటూరు అమ్మాయిలో ఎల్లోరాలో కనిపించిన అపురూపమైన అందం వుందని ఆరోజు బసవరాజు గుర్తించాడు. ఆ ఉదయం నించీ బసవరాజుకి ఆ అమ్మాయి రూపు కళ్ళముందు కదలడం మొదలు పెట్టింది.

మామ్మగారు ఈ వార్త చెప్పి- ఆ ప్రశ్నవేసినప్పుడు బసవరాజు ఆనందం ఎక్కడో ఆక్షణంలోనే కూలిపోయి దుఃఖం ముంచుకొచ్చింది. ఆ అమ్మాయికి పెళ్ళయిందట! పెళ్ళయిందని కూడా ఎలా తనకి తెలీలేదో బసవరాజుకి ఆశ్చర్యం వేసింది. వెయ్యక వెయ్యక చాలా పెద్ద తప్పటడుగు వేశాడన్నమాట: ఆ తప్పటడుగు తిన్నగా అగాధంలోకే నెట్టుతోంది!

రాళ్ళనీ, చెట్లనీ, పాములనీ మొక్కే ఈ అనాగరికులంతా తన వేపు వేలెత్తి చూపుతారని, తన మీదికి ఉమ్ముతారని భయమేసి జడిసిపోయాడు. ఆ బాధతోనే హోటల్‌కిపోయి తినిరావాలని వెళ్తున్నాడు. సరిగ్గా వందగజాలు వెళ్ళాడో లేదో, ఆ చిక్కటి చీకటి సందులో, అదే వీధిలో, రాక్షసుల్లాంటి జనం గుమిగూడారు.

'ఏం మేష్టారూ' అని ఒకరెవరో మాటాడుతుంటే 'కొవ్వెక్కిందిరా' అని ఇంకోడు బూతులుతిట్టడం మొదలుపెట్టాడు. 'లంజకొడుకిని ఒకపోటు పొడిచ్చంపండి, సూస్తన్నారింకా!' అని మరోడు ఉద్రేకాన్ని ఆపుకోలేకుండా మాటాడుతున్నాడు. 'ఈడొక హెడ్మాష్టరట, పిల్లలకి! ఇస్కూలికి! ఇకన ఆడపిల్లలమీద కూడా పడతాడు' అని యింకొకడు. 'సూస్తన్నారేవిటి ఎముకవిరగ్గొట్టక' అని ఇంకో మనిషి. తొందర చేస్తున్నారు. వాళ్ళ మధ్య రాందాసు లేకపోతే వాళ్ళు అన్నిమాటలు మాటాడేవారే కాదు. అందర్లోనూ కసి, కర్కశత్వం, పగ, ప్రతీకారవాంఛ, రోషం, ద్వేషం, అసహ్యం, ఈర్ష్య, పట్టపగ్గాల్లేని ఆగ్రహం.

సూరమ్మలాంటిపిల్ల ఆవూర్లోలేదు. అంత మంచిపిల్ల. ఆడపిల్ల అంటే ఆ పిల్లనే చెప్పుకోవాలి. ఆవూర్లో ఆయీడు పిల్లలెందరో వున్నారు. లేకేం? కాని సూరమ్మ అంటే ఆవూళ్ళో అందరికీ అభిమానం. ప్రేమ. రత్నంలాంటిపిల్ల. నిప్పులాంటిపిల్ల. పరాయి మగాళ్ళని కన్నెత్తి చూడదు. తన పనేమిటో తను చేసుకుపోతుంది. ఇంత చిన్నవయసులోనే శనివారాలూ, సోమవారాలూ, ఏకాదశులూ ఉంటుంది. అన్ని పండుగులూ చేస్తుంది. పెద్దలంటే ఆ అమ్మాయికి గౌరవం, భక్తీ వున్నాయి. పేదసాదలంటే ప్రేమా, దయా

ఉన్నాయి. అలాంటి మంచి ముత్తెంలాంటి పిల్లకు, గంగిగోవులాంటి పిల్లకు ఆరకంగా జరిగినందుకు విన్నవాళ్ళంతా బాధపడ్డారు. బసవరాజునీ, పట్నపోళ్ళ గుణాలనీ తిట్టారు. తెలిసిన వాళ్ళంతా వచ్చి సూరమ్మనీ, సూరమ్మ తలిదండ్రులనీ ఓదార్చి ఏవో హెచ్చరికలు కూడాచేసి, సూరమ్మ మంచితనాన్ని స్మరించుకుని వెళ్ళిపోతున్నారు.

నిప్పులోకినెట్టి జ్వాలల మధ్య సజీవ దహనం చేస్తున్నట్టయింది బసవరాజుకి. అంతలో అరవై యేళ్ళు దాటిన రామదాసు మళ్ళీ 'ఏమ్మేష్టరూ?' అని అడగబోయాడు.

"తప్పయిపోయింది. ఇంకెప్పుడూ చేయను. క్షమించండి సార్" అన్నాడు. ఆమాట అన్న తర్వాత అతడికి మరింత బాధ కలిగింది. బ్రతుకుమీది తీపికొద్దీ గౌరవాన్ని మంటకలిపి, చదువూ సంస్కారమూలేని అనాగరికులైన పశువుల్లాంటి వాళ్ళని క్షమాపణ అడగటమూ, తప్పయిందని ఒప్పుకోవడమూ, వాళ్ళ జాలీ, సానుభూతీ కోరడమూ, వాళ్ళ దయాధర్మాలతో బ్రతకడమూ అవమానకరంగా ఉంది. ఆ అమ్మాయిని పిలిచిన తప్పుకంటే, తప్పయిందనీ, క్షమించమనీ దయాభిక్ష వేడుకోవడం ఘోరమైన తప్పుఅనిపించింది.

అతనికి చెమటలు పోశాయి. కంపించిపోయాడు. పిరికివాడయిపోయాడు. ప్రాధేయపడ్డాడు. యాచించాడు. ఉన్నత గౌరవ శిఖరంనించి అప్రతిష్ట అధోలోకాలకి కూలిపోయాడు. సంస్కారి పోయి పశువయ్యాడు ఇప్పుడు ఈ నిమిషాన. ఉదయం ఈశ్వరాలయం నూతిదగ్గర.

బూతులు తిట్టి మనుషులని నెట్టుకుంటూ ముందుకు ఉరుకుతూ 'తప్పయిందా? సిగ్గులేదూ? థూ—తగల్నీయండి, తప్పేమిటో తెలిసొస్తాది పేణానికి. జడుస్తున్నా రెందుకురా' అని మరొకడు బలమైన చెయ్యెత్తాడు. రాందాసు వాడినిపట్టుకుని 'తప్పయిపోయిందన్నాడు గదా? వొదిలేయండ్రా. వొదిలేయండి. మేష్టారూ, యెల్లు. బుద్ధితెచ్చుకొని మంచోడిగా బతుకు. యెల్లు. యెల్లిపో,' అని రాందాసు అటూ ఇటూ ఆ గుంపుని తప్పించి దారిచూపాడు.

బసవరాజుకి అక్కడనించి కదిలి నడుస్తోంటే వెనక ఎవరో

వీపుమీద కత్తులతో పొడవటానికి సిద్ధంగా ఉండి వెంటాడుతున్నట్ట యింది. ఎలా వెళ్లాడో వెళ్ళాడు భోజనానికి. అది హోటల్ కాదు. పూర్వకాలపు పేదరాసి పెద్దమ్మ యిల్లులాంటి యిల్లు. ఆయింటిలో వయసు ష్ళిన ఒకామె ఉంది. ఆమె వండి అన్నం పెడ్తుంది. ఆవూళ్లో అప్పర్ ప్రయిమరీ స్కూలులోని మరో ఇద్దరు మేష్టర్లు, వియల్డబ్ల్యూ, ఫారెస్టుగార్డు లిద్దరూ మాత్రమే తింటారు. నెలకి ఇరవై రూపాయిలకి రెండుపూటలూ తిండిదొరుకుతుంది. వీథుల్లో ఉన్న మనుషులంతా వింతగా నిలబడి తననే చూస్తున్నట్టు అనిపించింది. అన్నం పెడ్తూ 'ముసలమ్మ' కొత్తగా చూసింది. తిండి ఒక్క మెతుక్కూడ తిన్లేకపోయాడు.

రేప్పొద్దున్న నూటా ఏభై మంది పిల్లల ముందు తలెత్తుకు నిలబడాలి. ఆదర్శాలు బోధించిన తను, హితోపదేశాలు చేసిన తను మేష్టర్లకి ముఖం చూపించాలి. ఆ మేష్టర్లు చూపే సానుభూతికీ, జాలికీ, దయకీ ఎదురుచూడాలి. వాళ్ళు బుద్ధులు చెపితే తలూపి వినాలి. కరణంతో ధైర్యంగా, నిజాయితీతో మాటాడే శక్తి యింక వుండదు. మనుషులని చూసి తప్పించుకుంటూ దొంగచాటుగా. నటిస్తూ నడవాలి. కోదండపాణి దగ్గర తలవాల్చుకోవాలి. ఫారెస్టు గార్డులు లంచాలు పుచ్చుకోవటం గురించి యింక మాటాడకూడదు, ప్రెసిడెంటు రెడ్డితో పదవుల్లో ఉన్న రాజకీయ నాయకుల అవినీతి గురించి నోరెత్తకూడదు. సారాయేపారం సాగిస్తున్న సత్తిన్నారాయణతో 'ఇంకోమంచిబిజినెస్ ఏదో చూసుకోకూడదూ?' అనకూడదు. షావుకారుతో 'ఓ సేట్‌జీ. లైసెన్స్ లేకుండా యీ మందు లమ్మకూడదండీ' అనటానికి వీల్లేదింక. "నీళ్ళు కలిపి పావలాకి సేరు పోయకపోతే ఆమంచి పాలేదో అర్ధరూపాయికే పొయ్యొచ్చుగా పాపమ్మా' అని పాలావిడతో చెప్పకూడదు. 'మంచోడు మామంచోడు' అన్న మొహాలన్నీ రేప్పొద్దున్న 'యీడేనా!' అని మొహాలు తిప్పుకుంటారు.

బసవరాజు మళ్ళీ అదేవీధిలోంచి అడుగు తీసి అడుగు వేసుకుంటూ నడిచి వెళ్ళాడు. అమ్మా, నాన్నా గుర్తుకొచ్చారు. తెలిస్తే

మసి అయిపోయారు. ఇంకా చాలామంది బసవరాజులు వచ్చి చీకటిలో కలిసిపోతారు.

బసవరాజుకి అదేసమయంలో అతడు నేర్చుకున్న చరిత్ర పాఠాలుకూడా గుర్తుకొచ్చాయి. సర్వభోగభాగ్యాలూ, ఐశ్వర్యాలూ అనుభవించి చివరకి కిరాతకంగా,అమానుషంగా చంపబడ్డ రారాజులు చాలామంది గుర్తుకొచ్చారు. వాళ్ళ జీవిత చరిత్ర ఏరకంగా ప్రపంచానికి మిగిలిందీ అతడికి అర్థమయింది.

*　　　　*　　　　*

రంగు రంగుల మేఘాల్లోంచి కొత్తరోజు పసితనంతో ఉదయించింది. ఆ రాత్రి చాలా పెద్దవర్షం కురిసినట్టుగా ఉంది. పక్క తంతా తడిసిపోయింది. ఇళ్ళ పై కప్పులన్నీ యింకా తడితడిగానే ఉన్నాయి. వరినాటుల పొలాలు తెల్లటి నీటితో నిండిపోయి తొలి సంజ వెలుగుకి అద్దం ముక్కల్లా కనబడుతున్నాయి. వూరికి పడమటి దిక్కు కానుకొని మహేంద్రతనయ తొలి యౌవనంలా పారుతోంది. కొండలు ఆకుపచ్చగా, నిర్మలంగా, మౌనంగా, గంభీరంగా కనబడుతున్నాయి. ఆకాశం కడిగేసినట్టు నిర్మలంగా ఉంది.

ఆ ఉదయం సూరమ్మ తమ యింటిముందు ఆవులసాలలో పేడ లెత్తుతోంది. కాని ఆ పిల్ల మనసు మనసులో లేదు. రాత్రి మేష్టరుని కొట్టబోయారు. ఆ విషయం ఇంట్లో చెప్పినప్పుడు ఇంత రాద్ధాంతమౌతుందనుకోలేదు. ఆ పిల్ల మేనమామ ఒకాయన దగ్గర పొలం గట్టుమీద కన్పించాడు. మేష్టరు తనతో మాటాడ్డం విన్నాడేమో ననుకుంది. ఇంట్లో చెప్పకపోతే అమ్మ కొడుతుందని భయం కలిగింది. ఏ రకంగా చెప్పాలో తెలీక చెప్పింది. ఆ చెప్పడం యీ రకంగా అర్థం చేసుకున్నారు. అవసరమున్నా లేకపోయినా అందరూ జోక్యం చేసుకున్నారు. రాత్రి పాపం! ఆ మేష్టరు యెంత బాధ పడ్డాడో!

బసవరాజు అంటే ఆమెకి చాలా ఇష్టం. అతడు మంచివాడు.

ఈరోజు పిలిచినప్పుడుకూడా ఎంతో మర్యాదగా పిలిచాడు. ఆరాత్రి సూరమ్మకి నిద్ర పట్టలేదు.

వేకువనే అమ్మ లేచిపోయి చల్ల తిప్పుతుంది. పిన్ని లేచి వంట మొదలు పెడుతుంది, అయ్యా లేచి పాలు తీస్తాడు. చిన్నయ్యా లేచి పశువులకి కుడుతులు పెడతాడు. చిన్న పిన్ని కసువూడుస్తుంది. నాయనమ్మ పనులు పెత్తాయిస్తుంది. తాత పొలాలు చూసి రావటానికి వెళ్ళిపోతాడు. కంబార్లు కొందరు పొలం పనిమీద, మరికొందరు పశువులని మేతకి తోలుకునీ వెళ్ళిపోతారు. అత్త నదినించి నీళ్ళు మోసుకొస్తుంది. తను సాలల్లోని పేడలు తీసి ఈసురుడి కోయిల దగ్గర మెట్టమీద పిడకలు తడుతుంది. ఆకోయలదగ్గర నూతిగట్టు కానుకుని ఈసురుడు కనిపించినట్లుగానే మేష్టరు కనిపిస్తాడు.

వీథుల్లోంచి పశువులు వూరి బయటికి పోతున్నఆ తెల్లవారు ఝామున చల్ల తిప్పుతున్న శబ్దం ఆగిపోయింది. తల్లి వచ్చి సూరమ్మ చేస్తున్న పని సగంలో ఆపేసి యింటిలోపలికి తీసుకు పోయింది. వూర్లో పరుగులూ, తెల్లమొహాలూ, ఆశ్చర్యాలూ, అయ్యయ్యో! అనుకోవడాలూ—అన్నీ బాగా చూశాక చివరకి మేష్టరు ఉరిపోసుకున్నాడని అందరికీ తెలిసింది.

వేకువఝామునే లేచి రోజూమల్లే మామ్మగారు పిలిచారట. పలకలేదట. నిద్రపోతున్నాడు గాబోలని వూరుకుందిట: తర్వాత పాల మనిషి పాపమ్మ వచ్చి కేకేసింది. పలకలేదు. నిద్రపోతున్నాడేమో, రాత్రంతా నిద్రలేక తెల్లవారేక నిద్ర పట్టిందేమోనని మామ్మగారు పాలు తీసుకుని అతడి గదిలో పెట్టేయాలని లోపలికి వెళ్ళేసరికి మంచం మీద మనిషి కనిపించలేదు. మధ్యవాసానికి లుంగీ కట్టి, లుంగీకి బెడ్డింగ్ తాడు కట్టి, కుర్చీ పక్కకి తన్నేసి అతి భయంకరంగా కన బడ్డాడు. మామ్మ చాలా పెద్ద గావుకేక వేసింది. పాలమనిషి పాపమ్మ తిరిగిచూసి వచ్చింది. మామ్మ కొడుకూ, కోడలూ, చిన్నకూతురూ వచ్చారు. నాయిడొచ్చాడు. ప్రెసిడెంట్ వచ్చాడు. కరణం వచ్చాడు. మనుషు లెవర్నీ లోపలికి పోనివ్వద్దన్నాడు. మేష్టర్లొచ్చారు. పిల్ల

లంతా చూట్టానికి వీలులేక బయట గుంపులు గుంపులుగా నిలబడ్డారు. కోదండపాణి వచ్చాడు. సెట్టి వచ్చాడు. రాందాసు వచ్చాడు. ఫారెస్ట్ గార్డులు వచ్చారు. చిన్నిదోళ్ల వచ్చారు. పెద్దీదోళ్ళు వచ్చారు. ఎగువీదోళ్ల వచ్చారు. మనుషులే మనుషులు! ఆడా, మగా, అంతా, భయంతో, బాధతో, కన్నీటితో!

ఆ వూర్లో రంగాగారి నీలంరంగు పతాకంలోని నక్షత్రంగాని, సుందరయ్యగారి అరుణ పతాకంలోని కొడవలీ సుత్తిగాని, బ్రహ్మానందరెడ్డిగారి త్రివర్ణ పతాకంలోని ధర్మచక్రంగాని బసవరాజుని సరియైన సమయంలో రక్షించలేకపోయాయి. చార్వాకుడుగాని, గోరాగాని, అతడు చూసిన రాజకీయ నాయకులుగాని, చివరికి అతడికి బియ్యే బియీడీ పట్టాలతో యిచ్చిన బైబిల్ గ్రంథాలుగాని, అతడు ఆదర్శంగా పెట్టుకున్న అమెరికా అభ్యుదయంగాని వోదార్చలేకపోయాయి. అతడి విజ్ఞానమంతా భవిష్యత్తు దుఃఖమయంగా, నిస్సారంగా చూపింది.

బసవరాజు వేలాడుతున్నాడు.

మామ్మ గుండె బాదుకుని, చచ్చిపోయిన తన కుమారుడి గుర్తుకు తెచ్చుకుని ఏడుస్తోంది. ఆరాత్రి రాందాసు ఇంటిముందు అలా జరిగిందని తెలిసిం తర్వాత, మామ్మ, "అంతా మన మంచికే నాయనా! కష్టాలు మనిషికి రాకపోతే మానుకొస్తాయా? ఈళ్ళంతా పుణ్యాత్ములూ, నీవు ఒక్కడివే పాపాత్ముడువా? మనసు గట్టి చేసుకో" అని చెప్పాలనుకుంది.కాని చెప్పలేకపోయింది. ఆ మాటలు చెప్పుంటే ఈ ఘోరం జరిగేదికాదని ఆమె ఏడుపు. ఆమాటలు మంత్రంగా పనిచేసేవని ఆమె నమ్మకం.

బసవరాజు వేలాడుతున్నాడు.

"అయ్యయ్యో, అయ్యయ్యో!" "ఆ తల్లీతండ్రీ,ఎక్కడో?" "ఇప్పుడేం చేస్తారు? వాళ్ళకి కబు రెలాగ?" "మా దొడ్డ మనిషి" "బారికోడిని పోలీసుల్దగ్గిరికి పంపించినారట!" "కృష్ణమూర్తి

గారూ! మీరు ఇదే నిమిషం సైకిలేసుకుని పట్నమెల్లి, బస్సు పట్టుకుని వాళ్ళూరెళ్ళి యీ కబురు చెప్పి తీసుకురండి.'' ''మా దొడ్డ మనిషి. దించినకళ్ళు ఎత్తకుండా నడిచేవాడు.'' ''రాత్రి రాందాసు ఏం చేశాడంట?'' ''ఏమయితేం, నిండుజీవితం మునిగిపోయింది.'' ''ఆ, వాడి మనవరాలేమో పెద్ద పతివ్రత. ఈయనేమో పెద్ద నీతిమంతుడు'' ''మేష్టరొట్టి పిరిగ్గుండోడు. దీనికే ఇంత తేగం సేసుకోవాలా?'' ''నా నాయినా, నీ ముచ్చట్లు నా మనవడు రోజూ చెప్పేవోడురా. ఈ వూర్లో నీ ఆయువు తీరిపోయిందా? ఇక్కడ నీఋణం తీరిపోయిందా'' ''మరియాద పోయిందని మానుభావుడు మనసిరిసుకున్నాడు.'' ''తినే పిందే ముండ''. ''సీరాములుగాడు రైలుకింద తలెట్టి సచ్చిపోయి యింకా నెలకాలేదు. మళ్ళీ యిది.'' ''ఈ వూరికి శనిపట్టింది. ఎంత మంచోడు.'' ''పాతికే ళ్ళుంటాయా? పాపం! ఆ తలిదండ్రులకి తెలిస్తే!'' ''పాపిష్ఠిముండ పుణ్యాతుముణ్ని తినేసింది.'' ''ఆత్మ హత్య మహా పాపం!'' ''గాడిదగుడ్డు.'' ''చచ్చిం తర్వాత పాపమో పుణ్యమో ఎవడిక్కావాలి?'' ''ఇంత మంచిమనిషి పోయాడుగదా?'' ''నేను గోడలు దూకాను. అర్ధరాత్రి దాని మొగుడు నిద్రలేచిపోతే వాడిని పడగొట్టి పరుగు తీశాను.'' ''అంతే. మనిషి బతుకు అంతే.'' ''మగోడన్న తర్వాత ఆమాత్తరం రసికత్వం లేకపోతే ఎలాగ?'' ''పద్దనాబంగాడిని నాయిడు ఎముకు లిరగొట్టించలేదా? పద్దనాభం నాయిడు కూతురుతో యిప్పుడుండడం లేదా?'' ''పోలీసు లొచ్చిం తర్వాత ఏంజేస్తారు?'' ''మాటమాత్రంగా నాకీ కబురు చెబితే నేను నాయుడుతో రాందాసుకి చెప్పించకపోయేవాడినా?'' ''ఇంతకీ మేష్టరు ఏం చేసినాడురా రాందాసూ? పిలిస్తే తప్పురా? నీ మనవరాలికేమై పోయిందిరా? ఎప్పుడూ ఎవ్వరూ గడపమీది కెళ్ళొద్దు పోలీసు లొచ్చిందాకా?'' ''రాందాసూ, వూరికి చాలా మంచిపేరు తెచ్చి నావురా! వయసు ముదిరిపోతే సరేనా? బుద్ధి ముదరాలి.'' ''పాపిష్ఠి ముండ బంగారంలాంటి మనిషిని తినేసింది.'' ''ఎల్లుండ్రా ఎల్లండి''

